

దాతృత్వాన్ని చాటుకున్న కలెక్టర్

- అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పాడేరు: చింతపల్లి మండలానికి చెందిన పివి రమణమూర్తి అనే వ్యక్తి గత కొంత కాలంగా అనారోగ్యంతో భాధపడుతూ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్‌ను శుక్రవారం కలెక్టర్ చాంబర్లో కలిసి తన భాధలు చెప్పుకున్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి అతని ఆరోగ్యం మెరుగుకు అవసరమైన మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచిస్తూ కొంత నగదును ఆర్థిక సాయంగా అందించి కలెక్టర్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కలెక్టర్‌కు రమణ మూర్తి, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.:

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా

- గిరిజన ఉపాధ్యాయుల గొంతునవుతా
- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి
- ఏజెన్సీలో విస్తృత ప్రచారం



చింతపల్లి మండలం వంగసార బాలికల ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న విజయగౌరి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఆమె శుక్రవారం అల్లూరి జిల్లాలోని చింతపల్లి, హుకుంపేట, అరకులోయ మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ క్రమంలో అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో తీవ్ర నష్టం జరుగనుందని, దీనికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని అన్నారు. 117 జిఒను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీన్ని రద్దు చేసినట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నిజానికి ఆ జిఒ రద్దు కాలేదని తెలిపారు. ప్రత్యామ్నాయంగా కొన్ని అంశాలను తీసుకొచ్చి అమలు జరుపుతున్నారన్నారు. దీని వల్ల ప్రాథమిక, మాధ్యమిక విద్యకు ప్రమాదం వాటిళ్లనుందన్నారు. హైస్కూల్‌లో పదో తరగతి పాస్ అయిన తర్వాత చదువుకునేందుకు పెట్టిన ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేయాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందని, దాన్ని రద్దు చేయకుండా కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తామని చెప్పారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు కృషి చేస్తానన్నారు. కెజిబివిల్లో మినిమం టైం స్కేల్ అమలు చేయకుండా అక్కడి ఉద్యోగులను ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందన్నారు. ఆదివాసీలకు ఏజెన్సీలో శత శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని శాసన మండలిలో గొంతెత్తుతానన్నారు. ప్రభుత్వం 1/70 చట్టానికి సవరణ చేయాలన్న ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల గొప్పతనాన్ని గుర్తుచేశారు. అరకులోయలో జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.మహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.చిట్టిబాబు, ఐద్వా రాష్ట్ర నాయకులు వివి.జయ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు శుభన్ పాల్గొన్నారు.



అరకులోయలో మాట్లాడుతున్న విజయగౌరి

హుకుంపేట : మండల కేంద్రంలోని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో విజయగౌరి ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నించే గొంతును మండలికి పంపాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు, సిఆర్‌టిల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నూకరాజు, సర్వ శిక్ష అభియాన్ జిల్లా ఉపాధ్యక్షులు వి.జయరాజు, గూడ స్కూలు ఉపాధ్యాయులు కె.దేవమ్మ, కె.వసంత, సీత లక్ష్మి, కె.రత్నకుమారి, ఎన్.సుశీల, ఎస్.కృష్ణకుమారి, జి.జయలక్ష్మి, ఆర్.జ్యోతి, చిట్టిబాబు, కుమారి పాల్గొన్నారు.

చింతపల్లి : మండలంలోని పలు పాఠశాలల్లో విజయగౌరి ప్రచారం చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నష్టపరిచే విధానాలను తీసుకొస్తున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులపై పనిభారం పెంచుతున్నాయని చెప్పారు. సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ అభ్యర్థులు మండలి వేదికగా సాగించిన పోరాటాన్ని గుర్తుచేశారు. తానూ ఆ స్ఫూర్తిని కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్, గిరిజన సంఘం నాయకులు పాంగి ధనంజయ్, సాగిన చిరంజీవి, జెవివి నాయకులు త్రిమూర్తులు రెడ్డి, ఉపాధ్యాయులు శెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా టెన్త్, ఇంటర్ పరీక్షలు

- -ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- - కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- -కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్



ప్రజాశక్తి పాడేరు: రానున్న పదవ తరగతి రెగ్యులర్, ప్రైవేటు, సార్వత్రిక (ఓపెన్ స్కూల్) పరీక్షలు, ఇంటర్మీడియట్ రెగ్యులర్, సార్వత్రిక (ఓపెన్ స్కూల్) పరీక్షలను అత్యంత పకడ్బందీగా సమర్ధవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, 144 సెక్షన్ అమలు చేస్తామని తెలిపారు. 20 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల ఫరిధిలో ఇంటర్నెట్, జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.పరీక్షా కేంద్రాలలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలను, మొబైల్ ఫోన్లను తీసుకు వెళ్లరాదని సూచించారు. ఎట్టి పరిస్థితులలోను మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలని, అత్యవసర కారణాలతో 15 నిమిషాల వరకు మాత్రమె అనుమతించడం జరుగుతుందన్నారు. సిసి కెమెరాలతో జిల్లా ప్రధాన కేంద్రం నుండి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. టెన్త్‌కు సంబంధించి కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9490270788కు సంప్రదించాలన్నారు. మార్చ్ 17 నుండి 31వ తేదీ వరకు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అందుకు గాను 71 పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామని, అందులో 18 కేంద్రాలలో ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయన్నారు.

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి సమాచార సేకరణకు ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, పరీక్షలకు, హాల్ టికట్లకు సంబంధించిన సమాచారాన్ని 9490811813 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 6,518 మంది, ఒకేషనల్ పరీక్షలకు 1,545 మంది, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలకు 5,335 మంది ఒకేషనల్ పరీక్షలకు 1,322 మంది కలిపి మొత్తం 15,055 మంది హాజరు కానున్నారని తెలిపారు. సార్వత్రిక విద్యా విధానంలో (ఓపెన్ స్కూల్) 1,699 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షలు మార్చ్ ఒకటవ తేదీ నుండి 20 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 26 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు మాత్రం మార్చ్ మూడవ తేదీ నుండి 15వ తేదీ వరకు జరుగుతాయని, అందుకు గాను ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముందుగానే ప్రతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి తాగు నీటి సదుపాయం, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు పరిశీలించడం జరిగిందని, నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఓ పి.బ్రహ్మాజీరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.అప్పలరాము, సహాయ కమిషనర్ (పరీక్షలు) శశి కుమార్ పాల్గొన్నారు.

గిరిజన యువతకు ముగిసిన శిక్షణ

సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన ఎలక్ట్రీషియన్ కిట్లు పంపిణీ



సర్టిఫికెట్లు, టూల్ కిట్ అందజేస్తున్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు

ప్రజాశక్తి -మారేడుమిల్లి: సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో మండలంలోని 20మంది గిరిజన యువతకు ఎలక్ట్రీషియన్స్ శిక్షణ ముగిసింది. సిఆర్‌పిఎఫ్. సి 42 బెటాలియన్ కమాండెంట్ ధర్మ ప్రకాష్ నేతృత్వంలో అసిస్టెంట్ కమాండెంట్ చరణ్ తేజ్ ఆధ్వర్యంలో 22 రోజులు పాటు ఎలక్ట్రీషియన్ శిక్షణనిచ్చారు.

. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కమాండెంట్ మాట్లాడుతూ గిరిజన యువతకు స్వయంఉపాధికి ఈ శిక్షణ తరగతులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయనే సదుద్దేశంతో మారేడుమిల్లి మండల ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురబోయిన పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గిరిజన యువతకు హౌస్‌వైరింగ్‌లో మెళకువలను నేర్పించి, శిక్షణనిచ్చారు. ఎలక్ట్రీషియన్ కోర్స్ ముగించిన గిరిజన యువతకు సర్టిఫికెట్లతోపాటు, ఎలక్ట్రికల్ టూల్ కిట్‌ను ఉచితంగా అందించారు. ప్రతిఒక్కరూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను జీవనోపాధికి వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తిగా ఉన్న గిరిజన యువతకు సిఆర్‌పిఎఫ్, పారా మిలిటరీలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సి 42 బెటాలియన్ ఎస్‌ఎంఒ డాక్టర్ నితిన్, జవాన్లు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు నిధులివ్వండి



శివాలయం వద్ద ఆందోళన చేస్తున్న రంప గ్రామస్తులు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంప గ్రామంలో శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు అటవీ శాఖ అధికారులు నిధులను విడుదల చేయాలని గ్రామస్తులు ఆందోళన. చేపట్టారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన రంప భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం ఏటా శివరాత్రికి ఐదు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించేవారమన్నారు. జలపాతం, దేవాలయ సందర్శనకు వచ్చే పర్యాటకుల నుండి టికెట్ రూపంలో వసూలు చేసి ఉత్సవాలు నిర్వహించేవారమన్నారు. ఇటీవల రంప జలపాతం వద్ద ఉన్న శివాలయాన్ని రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని ఫారెస్ట్ అధికారులు సిబిటి కమిటీని వేసి స్వాధీనపరచుకున్న తర్వాత, ఈ ఏడాది నిధులు ఇంకా విడుదల చేయకపోవడంతో ఉత్సవాల నిర్వహణ పనులు నిలిచిపోయాయన్నారు. దీనిపై అటవీ అధికారులను అడిగితే తిప్పి పంపుతున్నారే తప్ప, స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ఈ సందర్భంగా సిబిఐటి చైర్మన్ మాట్లాడుతూ తరాలను నుంచి వైభవంగా నిర్వహించే రంప భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఉత్సవాలు, అటవీశాఖ నిర్వాకంతో నిర్వహించలేని పరిస్థితి ఉండడంపై ఆవేదన వ్యక్తం చేశారు.. అటవీశాఖ అధికారులు స్పందించి వెంటనేనిధులు విడుదల చేయకుంటే ఐటిడిఎ ఎదుట నిరసన చేపడతామన్నారు. దీనిపై అటవీశాఖ రేంజర్‌ను వివరణ కోరగా శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు నిధులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, శనివారం చెక్ అందజేస్తామన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సురేంద్ర

శత శాతం ఉద్యోగ నియామక చట్టం చేయాలని

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

- ఎమ్మెల్యేకు ఆదివాసీ గిరిజన సంఘం నేతల వినతి

ప్రజాశక్తి-అరకులోయ: రానున్న అసెంబ్లీ సమావేశంలో షెడ్యూల్ ఏరియాలో వందశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం చేయాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బాలదేవ్‌లు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, బాలదేవ్ లు మాట్లాడుతూ, ఈనెల 24 నుండి జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం ప్రభుత్వం బడ్జెట్ సమావేశంలో ఆమోదించి ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జివో -3 చట్టబద్ధత,ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీపై రాష్ట్ర ముఖ్యమంత్రి అరకు ఎన్నికల సభలో ఇచ్చిన హామీ ప్రకారం రానున్న అసెంబ్లీ సమావేశంలో ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగ, నియామక చట్టం చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా గిరిజన సలహా మండలి నియమించలేదని, తక్షణమే ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు.1/70 చట్టం అమలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సమావేశంలో చర్చించాలని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియమకచట్టం, ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల పై ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి చిన్నబాబు, ఉపాధ్యక్షులు కె.జగన్నాధం, కె.మగ్గన్న పాల్గొన్నారు.

మన్యం వీరుల వారసులకు దక్కని గౌరవం

ఆదివాసీ తొలితరం ఎంపీ గాం మల్లు దొర కుటుంబీకుల ఆవేదన



అల్లూరి, మల్లుదొరకు నివాళులర్పిస్తున్న గాం మల్లు దొర వారసులు

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు మండలం స్వాతంత్ర పోరాటంలో అమరులైన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అనుంగుశిష్యులైన గాం గంటందొర. గాం మల్లుదొర వారసులైన తమకు ప్రభుత్వం నుంచి కనీస గుర్తింపు, గౌరవం దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్యం పితూరు సేనలో కీలక భూమిక పోషించి, తెల్లదొరలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో సీతారామరాజు సైన్యంలో కీలక భూమిక పోషించి, బ్రిటిషర్లను గడగడలాడించిన గాం గంటం దొర, గాం మల్లు దొర వారసులను ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. దేశ స్వాతంత్రం అనంతరం భద్రాచలం నియోజకవర్గం నుంచి తొలితరం ఎంపీగా ఢిల్లీ పార్లమెంటుకు ఎన్నికైన మల్లు దొర వారసులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల గాం గంటం దొర కుటుంబీకులను దేశ రాజధాని ఢిల్లీకి తీసుకువెళ్లి రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును పరిచయం చేసిన నాగార్జున కన్స్ట్రక్షన్ కంపెనీ యాజమాన్యం, రాష్ట్రపతికి హామీ మేరకు క్షత్రియ సేవా సమితి తరపున రూ.3.5 కోట్లతో గంటం దొర వారసులైన 11 కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిందన్నారు అయితే గాం మల్లు దొర కుటుంబీకులను ప్రభుత్వం గానీ, ఏ ఇతర సంస్థలు గానీ పట్టించుకోవడం లేదని గుడ్లపల్లి గ్రామానికి చెందిన గాం మల్లుదొర మనుమరాలు కొప్పుల చంద్రావతి, కొత్తూరు లక్ష్మి వారి నాల్గవ తరం సంతానమైన కొప్పుల రాజబాబు, కొప్పుల బాలమ్మ, కొప్పుల లక్ష్మి, పొత్తూరు నాగమణి ,పొత్తూరు కుమారి, పొత్తూరు విజయ, పొత్తూరు కల్పన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కాకరపాడు ప్రధాన కూడలిలో అల్లూరి, మల్లు దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించి, తమకు న్యాయం చేయాలని మల్లుదొద వారసులు వేడుకుంటున్నారు. మన్యం వీరుల వారసుల్లోని అందరి కుటుంబాలకు సమాన గౌరవం దక్కాలని మల్లు దొర కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లూరి సేవా సంఘం మహిళా అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి ,కోనా సత్తిబాబు, మన్యం వీరుడు గాం మల్లు దొర కుటుంబీకులు పాల్గొన్నారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం వద్దు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి -సీలేరు: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజన అందించాలని జికె.వీధి తహశీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఆర్‌వి నగర్ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సిబ్బందితో సమావేశమై పలు విషయాలు పై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, హాస్టల్,. తరగతి గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్ఒ ప్లాంట్ మరమ్మతులపై ఆరాతీసారువిద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. హెచ్‌ఎం జి చిన్నయ్య పడాల్, డిప్యూటీ వార్డెన్ దమయంతి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

కొండబాబు మాస్టారుకు ఘన సత్కారం

జాతీయస్థాయి పురస్కారంపై అభినందనలు



డ్రాయింగ్ మాస్టారు కొండబాబును సత్కరిస్తున్న హెచ్‌ఎం, పిఎంసి చైర్మన్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలలో ప్రతిభా అవార్డును సొంతం చేసుకున్న స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబును శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం డివి.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పిఎంసి చైర్మన్ ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన అభినందించి, పుష్పగుచ్చాలను అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు.

గుంటూరు క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఇటీవల చిత్రకారులకు నిర్వహించిన పోటీల్లో కొండబాబు మాస్టారు ప్రతిభ కనబరిచాడుఈ సందర్భంగా హెచ్‌ఎం డివి గోపాలకృష్ణ మాట్లాడుతూ, జాతీయ స్థాయి చిత్రలేఖనంపోటీల్లో తమ పాఠశాల డ్రాయింగ్ టీచర్ మిరియాల కొండబాబు మెరిట్ అవార్డు పొందడం గర్వంగా ఉందన్నారు.

గతంలోనూ కొండబాబు అమలాపురంకోనసీమ చిత్రకళా పరిషత్ పికాసో అవార్డు, వడ్డాది చోడవరంలో ఉత్తమ గురూజీ అవార్డుతో సత్కరించారన్నారు. పిఎంసి చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలలో పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుపొందడంలో కొండబాబు మాస్టారు కృషి, పట్టుదల, సాధన ఉందన్నారు .సత్కార కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ ఎం మహబూబ్ ఆలీ, పాపాని వీరభద్రరావు, ఉపాధ్యాయులు ఛప్పా సత్యన్నారాయణమూర్తి, సిహెచ్ శివకృష్ణ, పోసి బాబు, సత్యంబాబు, రాట వెంకటరమణ, జి వెంకటరమణ, బి నాగేశ్వరరావు, విఘ్నేశ్వరరావు, రాజమ్మ, జయలక్ష్మి, గంగాభవాని, ఏసు కుమారి, నానాజీ, పాల్ బాబు, ఎం ప్రసాద్ రెడ్డి, ఎస్ అప్పారావు, రేష్మ శాంతిప్రియ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి -కొత్తకోట: చెత్త సంపద కేంద్రాలతో స్థానిక పంచాయితీలకు సంపద పెంచుకునే అవకాశం ఉందని అనకాపల్లి జిల్లా రావికమతం మండలం పంచాయతీ విస్తరనాధికారి బానోజీరావు అన్నారు. కొత్తకోట చెత్త సంపద కేంద్రం వద్ద శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రీన్ అంబాసిడర్ లకు చెత్త సేకరణ పై సంపద తయారీ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల పరి శుభ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయ వనరులుగా మలుచు కోవచ్చునని పేర్కొన్నారు. వర్మీ కంపోస్ట్, తయారీ అనంతరం రైతులకు ఎరువులు గా విక్రయించు కోవచ్చునని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో రెండు టీమ్‌లుగా ఏర్పడి తడి, పొడి చెత్తలను ఎలా వేరు చేయాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పీసా చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి -గంగవరం : పీసా చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు స్వయంశక్తి గ్రూపు సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణనిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లక్ష్మణరావు మాట్లాడుతూ పీసా చట్టం అమలుపై ప్రజలకు, అధికారులకు అవగాహన ఎంతో అవసరమన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజకుమార్, ఉపాధి హామీ పథకం ఎపిఒ ప్రకాష్, వెలుగు ఎపిఎం షణ్ముకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా పప్పు దినుసుల పండగ



ఇంటింటా ప్రసాదం పంచుతున్న పూజారి

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం లక్కవరపుపేట పంచాయితీ ఎర్ర చెరువుల గ్రామంలో గిరిజనులు శుక్రవారం పప్పు దినుసులు పండగ ఘనంగా జరిపారు. ఏటా రైతులు కందులు మినుములు పెసలు రాజ్మా వంటి పప్పుదినులను పండిస్తారు. అవి చేతికి అందివచ్చిన తర్వాత ఈ పండుగను ఆనవాయితీగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపిటిసి ఎం సత్యనారాయణ సతీసమేతంగా ఇంటిలో సంకుదేవుడును భక్తి చేతులతో పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజన ఆచార, సాంప్రదాయ ప్రకారం ఉడికించిన పప్పు అన్నాన్ని ఇంటింటికి గ్రామ పూజారి అందజేస్తారు. పప్పు పండగ రోజున పలు వంటకాలు తయారుచేసి గోమాత సమర్పిస్తారు.



ఊట నీటిని తోడుతున్న మహిళలు

మల్లెపాడులో తాగునీటికి అవస్థలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో లుంగపర్తి పంచాయతీ పరిధి మల్లెపాడు గ్రామంలో తాగునీటి సమస్యతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామంలో 25 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామానికి పైప్‌లైన్, బోరు బావి వంటి వసతులు నోచుకోలేదు. దీంతో ఆ గ్రామానికి చెందిన గిరిజనులు కొండ వాగు నుండి నీటిని సేకరిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినప్పటికీ తమ గ్రామానికి కనీస తాగునీటి సదుపాయం కల్పించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

ఉపాధే లక్ష్యంగా బయోమెడికల్ ఇంజినీరింగ్

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచేలా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉన్నత ప్రమాణాలతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బయోమెడికల్ ఇంజినీరింగ్ కోర్సును ప్రారంభించిందని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ తెలిపారు. బయోమెడికల్ ఇంజినీరింగ్ రంగంలో అవకాశాలు అనే అంశంపై బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంజినీరింగ్‌తో పాటు వైద్య కళాశాల గీతంలో ఉండటాన్ని ప్రయోజనకరంగా మలుచుకునే విధంగా నిపుణుల పర్యవేక్షణలో కోర్సును రూపొందించామన్నారు. విశాఖ మెడ్‌టెక్ జోన్ సహకారంతో ఈ కోర్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య పరికరాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేయడానికి బయోమెడికల్ ఇంజినీరింగ్ నిపుణుల అవసరం ఉందన్నారు. సరికొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలపై బయోమెడికల్ ఇంజినీరింగ్ నిపుణులు దృష్టి సారించాలని సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం వ్యవస్థాపకుడు డాక్టర్ విజయ్ వైద్యనాథన్ మాట్లాడుతూ, ప్రజల జీవితాలను నేరుగా ప్రభావితం చేయగల సామర్థ్యం బయోమెడికల్ ఇంజినీరింగ్ నిపుణులకు ఉందన్నారు. బయోమెడికల్ రోబోటిక్స్, బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, బయో త్రీడి ప్రింటింగ్ తదితర అంశాలపై జరుగుతున్న పరిశోధనలను వివరించారు. గీతం బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ శరత్‌బాబు మాట్లాడుతూ, బయోమెడికల్ ఇంజినీరింగ్ ప్రాధాన్యతను వివరించారు.

గీతంలో భట్నాగర్ జయంతి

ప్రజాశక్తి -మధురవాడ : సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ జయంతిని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని భట్నాగర్ ప్రయోగశాలల వద్ద నిర్వహించారు. భట్నాగర్ విగ్రహానికి సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెవిజి.కృష్ణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజహితానికి విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు ఉపయోగపడాలన్నారు. భారతదేశం విజ్ఞాన శాస్త్ర రంగంలో అభివృద్ధి చెందడానికి సర్ శాంతి స్వరూప్ భట్నాగర్ వంటి పరిశోధకుల దూరదృష్టి కారణం అన్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్‌ను సైన్స్ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

ప్రజలకు సకాలంలో ధ్రువపత్రాలు

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : ప్రజలకు సకాలంలో ధ్రువ పత్రాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎపి సేవా సర్వీసెస్ ద్వారా 574 రకాల సేవలు అందించడం జరుగుతోందని, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుని అవసరమైన ధ్రువపత్రాలు పొందవచ్చన్నారు. ప్రజలు సచివాలయం సందర్శన సమయంలో డిజిటల్ సహాయకులు అందుబాటులో ఉండాలని, దరఖాస్తు నమోదు చేసుకుని వారికి సకాలంలో జారీ చేయాలని ఆదేశించారు. డిజిటల్ సహాయకులు సెలవులో వెళ్ళే సందర్భంలో సంబంధిత ఎంపిడిఓలు దరఖాస్తు దారులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేస్ట్, ఇన్కమ్, జనన, మరణ ధృవపత్రాల జారీలో నిర్లక్ష్యం, ఆలస్యం లేకుండా నాణ్యవంతంగా సేవలు అందించాలని ఆదేశించారు. మ్యుటేషన్లను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున రిజిస్ట్రేషన్ల అవసరాన్ని గుర్తించాలని సూచించారు. వివాహ రిజిస్ట్రేషన్లను ప్రోత్సహించాలన్నారు. రెవెన్యు సదస్సులలో అందిన ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు.

జిల్లా న్యాయ సేవా ప్రాదికారిక సంస్థ ప్రిన్సిపాల్, జూనియర్ సివిల్ జడ్జ్ జి.స్వర్ణ మాట్లాడుతూ, జనన, మరణ, ఇన్కమ్, కేస్ట్ ధృవపత్రాల జారీ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఆలస్యంగా జారీ చేయడంతో ప్రభుత్వం నుండి అందవలసిన లబ్ధిని కోల్పోయే అవకాశం ఉందన్నారు.సకాలంలో ధృవపత్రాల జారీకి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కే.పద్మలత, డిపిఓ లవ రాజు, డివిజినల్ పిఒ పిఎస్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు నాగరాజు, పాడేరు డివిజన్ లోని 11 మండలాల ఎంపిడిఓలు, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తాం

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రమణ



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు రమణ

ప్రజాశక్తి-చింతపల్లి: గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు పి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ ఆధ్వర్యంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ కోఆర్డినేటర్ నాగార్జునతో కలిసి చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన ఉద్యోగులు పని చేస్తున్న ప్రభుత్వ కార్యాలయాలతో పాటు చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఇన్చార్జి సూపరిండెంట్ చంద్రశేఖర్‌ను రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మైదాన ప్రాంతంలోని ఉద్యోగులకంటే గిరిజన ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులకు పనిభారం అధికంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ వెంకటగిరి, అధ్యక్షులు దేపూరు శశికుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న ఉత్తరాంధ్ర న్యాయవాదుల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర న్యాయవాదుల కమిటీని ఆదివారం ఏర్పాటు చేస్తున్నామని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, సెక్రటరీ డి.నరేష్ కుమార్ తెలిపారు. పోర్టు పోలియో జడ్జి రఘునందనరావు విశాఖపట్నం జిల్లాకు కొత్త అడ్మినిస్ట్రేట్ జడ్జిగా నియమతులైన సందర్భంగా హర్షం వ్యక్తపరుస్తూ, విశాఖపట్నం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 23వ తేదీన ఉత్తరాంధ్ర కమిటీ ఏర్పాటుకు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లా, విశాఖపట్నం, జిల్లాల ప్రముఖ న్యాయవాదులు సమావేశం కానున్నట్లు తెలిపారు. ఆదివారం ఏర్పాటైన కమిటీ ద్వారా హైకోర్టు బెంచ్ కోసం ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బిఇ.శ్రీనివాస్, మెంబర్ ఎం.గౌరిప్రసాద్, ప్రముఖ న్యాయవాదులు పాల్గొన్నారు.

కప్పరాడలో డిఎంహెచ్ఒ పర్యటన

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం లక్ష్మీనగర్, బాపూజీనగర్, కప్పరాడ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి, ఓపి, ఐపి, సేవలు, ఇహెచ్ఆర్ డయాగ్నొస్టిక్ సేవలు, మందులు, వ్యాక్సిన్ పోటెన్సి, ముఖ్యంగా ఎన్‌సిడి 3.0 సర్వే, ఎన్‌సిడి 2.0 ఫాలో-అప్, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కె తదితరాలపై ఆరా తీశారు. కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవలు గురించి వైద్య సిబ్బందికి విశదీకరించారు. అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాదించాలని ఆదేశించారు. తదుపరి ఫ్రైడే-డ్రైడే జరుగుతున్న ప్రదేశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఉమావతి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండలంలోని నరవ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో కొండ వద్ద గల గ్రావెల్ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. పాక్షికంగా కాలి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సిఐ సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని వయసు సుమారు 25 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, ఎత్తు 5.4 అడుగులు, నీలం రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నారని సిఐ తెలిపారు. క్లూస్ టీమ్‌తో కలిపి దర్యాప్తు చేస్తామని చెప్పారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.

యువకునిపై దాడి

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసినట్లు యువకుడు దుర్గాప్రసాద్ తెలిపాడు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న తాను పని ముగించుకొని గురువారం రాత్రి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆపి మొబైల్ ఇమ్మని అడిగాడని, అతని వద్ద మద్యం తాగిన వాసన రావడంతో ఇవ్వలేదని తెలిపాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి కత్తి తీసి తనపై దాడి చేశాడని వివరించాడు. పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు యువకుడు తెలిపాడు.

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి మండల తహశీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా సందర్శించిన ఆయన అక్కడి సిసి కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే సమాచారాన్ని ముందే తెలియజేయాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : రీ సర్వే చేపట్టబోయే గ్రామాల్లో రైతులకు ముందస్తు సమాచారం అందించాలని, నిబంధనల మేరకు సంబంధిత నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని దాకమర్రి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను స్థానిక అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. పొలాల్లో కలియ తిరిగి పరిస్థితులను గమనించారు. అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలనడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. భూముల పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు, దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చేపడుతున్న ఈ ప్రక్రియకు రైతులు పూర్తి సహకారం అందించాలని, దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు.

అనంతరం అదే గ్రామంలో ఉన్న సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ సచివాలయంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది సమయ పాలన పాటిస్తున్నారా లేదా అని రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండాలని, వారి నుంచి వచ్చే వినతులకు త్వరిత గతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఎన్.హనుమంతరావును ఆదేశించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది పారిశుధ్య చర్యలపై దృష్టి సారించాలని, ప్రజా రోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పైలా రామారావు, ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు పాల్గొన్నారు.

'శ్రీపాద'లో నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార శ్రీపాద డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీపాద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డి.రాజేష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కదారిస్ గ్రూప్స్, ఎస్‌బిఐ కార్డ్స్, టోస్మార్ట్ సొల్యూషన్స్, హెచ్ఆర్ ఇంటర్న్‌షిప్, నవరాధి టెక్నాలజీస్, ఇండియన్ బ్యాంక్, వావిన్, ఫెనెస్టా, మయోరా, ఫాక్స్‌కాన్ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటాయని వివరించారు. ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



సెల్ ఫోన్ టార్చ్ వెలుగుల్లో నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

రోస్టర్‌పై గ్రూప్ 2 అభ్యర్థుల నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోస్టర్ పాయింట్స్ సవరించి పరీక్షలను యధావిధిగా కొనసాగించాలని గ్రూప్ - 2 అభ్యర్థులు విశాఖలోని ఎంవిపి.కాలనీలోగల ఆర్‌సి రెడ్డి స్టడీ సెంటర్ వద్ద సెల్‌ఫోన్ల టార్చ్ వెలుగులో శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 23న గ్రూప్ - 2 పరీక్షలు జరగనున్న నేపథ్యంలో రోస్టర్ పాయింట్స్ తీరుపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినదించారు. వెబ్ నోట్ వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో తాము ఎన్నో బాధలు పడ్డామని, కూటమి ప్రభుత్వం వచ్చినా అవి అలానే ఉన్నాయని మండిపడ్డారు. మంత్రి నారా లోకేష్ అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకొని గ్రూప్-2 మెయిన్స్ పరీక్షను నిర్వహించాలన్నారు.

పెరుగుతున్న జిబిఎస్ కేసులు

- కెజిహెచ్‌లో 8 మందికి చికిత్స

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో గులియన్ బారో సిండ్రోమ్ (జిబిఎస్) కేసులు పెరుగుతున్నాయి. దీంతో జిల్లా ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మొన్నటి వరకూ కెజిహెచ్‌లో ఐదుగురు జిబిఎస్ వ్యాధితో చికిత్స పొందుతుండగా, గ్రామీణ జిల్లా నుంచి మరో ముగ్గురు ఇదే వ్యాధితో గురువారం కెజిహెచ్‌లో చేరారు. దీంతో ప్రస్తుతం అక్కడ జిబిఎస్ వ్యాధితో చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎనిమిదికి చేరుకుంది. జిబిఎస్ వ్యాధిగ్రస్తులకు సరైన చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఇక్కడ ఈసరికే వైద్యం పొందుతున్న ఐదుగురు రోగులు రోజులు గడుస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో కోలుకోని పరిస్థితి కనిపిస్తోంది. కొద్దిరోజుల క్రితం ఒక మహిళ ఈ వ్యాధితో మరణించిన సంగతి తెలిసిందే. సరైన వైద్యం అందక ఆమె మరణించినట్లు మృతురాలి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఆమె మృత్యువాత పడటానికి ఒక రోజు ముందు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద మీడియాతో మాట్లాడుతూ జిబిఎస్ వ్యాధి గురించి ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఇది అంత ప్రమాదకరమైన వ్యాధి కాదని, చాలా పురాతనమైనదని, అంతేకాకుండా ఈ వ్యాధితో వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలను అందివ్వడానికి వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చారు. ఆయన ఈ ప్రకటన చేసిన మరుసటి రోజునే సదరు మహిళ జిబిఎస్ వ్యాధితో కన్ను మూసింది. ఇప్పుడు ఇదే వ్యాధితో మరో ముగ్గురు రోగులు కెజిహెచ్‌లో చేరిన సందర్భంగా శివానంద మీడియాకు వివరణ ఇస్తూ ప్రస్తుతం ఆసుపత్రిలో 8 కేసులు ఉన్నాయని, వీరికి న్యూరో విభాగ వైద్య నిపుణులతో కలిసి అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, రిపోర్టులు వచ్చాక వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. జిబిఎస్ కేసులను నిత్యం పర్యవేక్షణ చేయడానికి మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సత్యప్రసాద్, న్యూమరాలజీ విభాగం డాక్టర్ సతీష్ కుమార్, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్‌లను నోడల్ ఆఫీసర్లుగా నియమించినట్లు తెలిపారు.

కేసులు పెరిగే వీలుంది.. వైద్యులు సిద్ధంగా ఉండాలి

జిబిఎస్ కేసులు పెరిగే అవకాశం ఉన్నందున, కెజిహెచ్ వైద్యులు అధునాతన చికిత్సా నైపుణ్యంతో సన్నద్ధమై ఉండటం చాలా అవసరమని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఎఎంసి, కెజిహెచ్ అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్ల కోసం ఆంధ్ర మెడికల్ కాలేజీలోని ఎగ్జామ్ గ్యాలరీలో ముఖ్యమైన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిబిఎస్ కేసులలో ప్రజలలో పెరుగుతున్న ఆందోళనలకు ప్రతిస్పందనగా ఈ కార్యక్రమాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపుతో సమస్యల పరిష్కారం

డివి.రాఘవులు విజయానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- విఆర్.పురం: ఉభయగోదారి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డివి రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని శ్రీరామగిరి, రాజుపేట, రామవరం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతోపాటు పోలవరం నిర్వాసితులు , ఇతర అన్నివర్గాల ప్రజల సమస్యలపై సిపిఎం, ప్రజాసంఘాలు పోరాడుతున్నాయని, శాసనమండలిలో ప్రజావాణిని బలవంతంగా వినిపించి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోరాడాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు భూములను త్యాగం చేసిన నిర్వాసితులను పునరావాసం కల్పించకుండానే ఖాళీచేయాలని అధికారులు హుకుం జారీ చేస్తున్నారని, నిర్వాసిత కాలనీల్లో కనీస సౌకర్యాలు లేకపోగా, సవాలక్ష సమస్యలు పేరుకుపోయి ఉన్నాయని, నిర్వాసిత కుటుంబాల్లోని మేజర్ సన్స్‌కు ప్యాకేజీ వర్తించడంలేదని ఇవేకాక జిఒ3 ప్రయోజనాలు పునరుద్ధరణ, గిరిజన సంక్షేమ టీచర్ల గురుకులాల్లోని అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటన వంటి సమ్యలపై పిడిఎఫ్ అభ్యర్థులు శానసమండలిలో పోరాడుతున్నారన్నారు. ఉన్న పిడిఎఫ్ అభ్యర్థులకు మరింత బలం చేకూరాలంటే ఈనెల 27న జరుగుతున్న ఎన్నికల్లో ఉభయగోదారి జిల్లాల నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా డి.వి.రాఘవులకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానంగా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ మండల కార్యవర్గ సభ్యులు సత్తిబాబు, కారం సుందరయ్య, వడ్లాది రమేష్, పులి బుజ్జి, మండల నాయకులు గుండుపూడి లక్ష్మణరావు,శ్రీరామగిరి శాఖ సెక్రెటరీ కాంతారావు, వార్డు సభ్యుడు రవి వర్మ, నల్లారపు.చంద్రరావు, ఏసు పాల్గొన్నారు



ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

38 రూట్లలో బస్సుల కొరత

అద్దెకు ఆర్‌టిసి సర్వీసులు
ఓ ప్రైవేటు విద్యా సంస్థ సేవలో ఏళ్ల తరబడి 22 బస్సులు
ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు - ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో ప్రజా అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వ రవాణా లేదు. ఈ విషయాన్ని ఆర్‌టిసి అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో ఆర్‌టిసిని కార్పొరేషన్ నుంచి ప్రభుత్వంలోకి విలీనం చేసిన నుంచీ ఒక్క కొత్త బస్సు ఇక్కడకు వచ్చింది లేదు. ప్రభుత్వాలు ఇంతవరకూ కొనుగోలు చేసిన బస్సులూ లేవు. విశాఖ జిల్లాలో 38 రూట్లలో బస్సుల కొరత వెంటాడుతోంది. బస్సులు మరిన్ని అవసరమని ప్రజా రవాణా సంస్థ జిల్లా అధికారి అప్పలనాయుడు 'ప్రజాశక్తి'కి తెలిపారు. 70 బస్సుల వరకూ ఆర్డర్ పెట్టామని, త్వరలో రాబోతున్నాయని ఆయన చెబుతున్నారు.



ప్రైవేటు విద్యాసంస్థ ఆవరణలో బారులు తీరిన ఆర్‌టిసి బస్సులు

ఓ విద్యాసంస్థకు బస్సుల కేటాయింపు ఇలా..

నగరంలోని ఓ ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థకు ఏళ్ల కాలం నుంచి 22 ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. అద్దెకు ఆర్‌టిసి బస్సుల విధానంలో భాగంగానే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వాలు చేసినప్పటికీ విశాఖ ప్రజా అవసరాలకు తీరని నష్టం చేసేదిగా ఉంది. ప్రజా రవాణాకు సరిపడా బస్సులు లేకుండా ఏళ్లతరబడి ఆ విద్యా సంస్థకు బస్సుల కేటాయింపుపై విమర్శలు వస్తున్నాయి. సంబంధిత విద్యాసంస్థ బయట రోడ్లపై నిత్యం ఆర్‌టిసి బస్సులు దర్శనమిస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో ఆర్‌టిసి బస్సులను కేటాయించినప్పుడు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడం శోచనీయం.

ఆర్‌టిసి దెబ్బతీసే చర్యలు

ఆర్‌టిసిని దెబ్బతీసే చర్యలను కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలోనే మోడీ సర్కారు విద్యుత్ బస్సుల ప్రణాళికను ముందుకు తెచ్చింది. విశాఖకు మరో రెండు నెలల్లో 100 విద్యుత్ బస్సులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ రెండు నెలల్లో 15 ఏళ్ల పైబడ్డ బస్సులు 20 శాతం మేరకు 'స్క్రాప్' కింద మారిపోబోతున్నాయి. కొత్తగా వచ్చేవన్నీ విద్యుత్ బస్సులు కావడం, ఇప్పటికే సొంతవి లేకపోవడం, ఉన్నవాటిల్లో ఆయా విద్యా సంస్థలకు అద్దెకివ్వడంతో 'ప్రజారవాణా' భావన కుంటుపడుతోంది. వచ్చేటువంటి విద్యుత్ బస్సులు కూడా వ్యక్తులవి కావు. పెద్ద పెద్ద సంస్థలో, కాంట్రాక్టర్లో నిర్వహించే అవకాశం ఉన్నందున ఆర్‌టిసి క్రమంగా ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లబోతుందన్న సంకేతాలు వినిపిస్తున్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న బొత్స

బాబు మారలేదు

- రైతులు, వ్యవసాయం దండగ అనే భావనలోనే ఉన్నారు
- శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు ఏమీ మారలేదని, రైతులు, వ్యవసాయం దండగ అనే భావనలోనే ఉన్నారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మిర్చి రైతుల కష్టనష్టాలు తెలుసుకోవడానికి వైఎస్.జగన్ గుంటూరు మిర్చి యార్డుకు వెళ్తే తప్పేంటని, అది ఇల్లీగల్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. బీచ్ రోడ్డులోగల తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బొత్స మాట్లాడుతూ విజయవాడలో అట్టహాసంగా టిడిపి ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహించడం లీగల్ అవుతుందా అని చంద్రబాబుకు సూటి ప్రశ్న వేశారు. జగన్ మిర్చి యార్డ్‌కు వెళ్లిన తర్వాత మిర్చి రైతుల ఆవేదన ప్రభుత్వానికి తెలిసిందని అన్నారు. రైతులకు మద్దతు ధర ఇవ్వాలనే ఆలోచన రెండు నెలల క్రితమే ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. కేంద్ర మంత్రి ఢిల్లీలో లేనప్పుడు మిర్చి రైతుల కోసం చర్చించడానికి వెళుతున్నామని చంద్రబాబు చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వెళ్ళేవారికి భద్రత ఎలా ఇస్తామంటూ జగన్‌ను ఉద్దేశించి సిఎం హోదాలో ఉన్న వ్యక్తి బాధ్యతారహితంగా మాట్లాడటం దారుణమని అన్నారు. జగన్‌కు భద్రత కల్పించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దీనిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సందర్భంలో ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారని బొత్స తెలిపారు. సమావేశంలో రాష్ట్ర మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ శాసన సభ్యులు తైనాల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికులను తగ్గించే కుట్రలు తగవు

ప్రజాశక్తి - ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులను తగ్గించే కుట్రలను యాజమాన్యం మానుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1472వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎఐటియుసి నాయకులు, పలు విభాగాల ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ఒకపక్క శాశ్వత ఉద్యోగులకు విఆర్‌ఎస్ పేరుతో బయటకు సాగనంపుతూ.. మరోపక్క కాంట్రాక్టు కార్మికులను తొలగించి స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను తగ్గించే కుట్రలకు యాజమాన్యం తెగబడుతోందన్నారు. ఇప్పటికే కార్మికులు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వ చర్యలతో అన్ని విధాలుగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పుడు ఉన్న ఉపాధిని కూడా తొలగించే చర్యలు చేపట్టడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను తగిన సామర్థ్యంతో నడిపించడానికి కృషి చేస్తున్నామని చెబుతూనే కార్మికుల తొలగింపు చర్యలు దేనికని ? ప్రశ్నించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చిన్న, మధ్య తరహా పత్రికల సమస్యలపై జర్నలిస్టులు అందించిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్ తెలిపారు. శుక్రవారం ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్రాడ్‌కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్లకు చెందిన పలువురు జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఒను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు చిన్న, మధ్య తరహా పత్రికలకు సంబంధించిన సమస్యలను ఆయనకు వివరించారు. నిబంధనల ప్రకారం వారికి ప్రకటనలిస్తున్నట్లు డిఆర్ఒ చెప్పారు.